

RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక

విలేకరులు కావలెను
తెలుగు భాషపై పట్టు స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన
యువత యువకులకు జర్నలిస్టుగా పనిచేసేందుకు సదావకాశం
న్యూస్ వార్ దిన పత్రిక
నూతన ఒరవడి ప్రత్యేక కథనాలతో మీ ముందుకు వస్తున్న న్యూస్‌వార్ దిన పత్రికలో
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు,నియోజకవర్గాలు, మండల కేంద్రాలల్లో
వార్తాసేకరణకు విలేకరులు కావలెను ఆసక్తి కలవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించండి.
94409 91979

నల్లగొండ | epaper.news war.com | ఆదివారం 3, మే 2026 | సంపుటి :16 సంచిక :39 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00



## 60 రోజుల గడువు.. ఈ చట్టం అమెరికా అధ్యక్షుడిని ఆపగలదా..

ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో, అమెరికాకు సంబంధించిన ఒక కీలక చట్టం గురించి చర్చ మొదలైంది. అదే వార్ పవర్ చట్టం (1973). ఈ చట్టం ప్రకారం, కాంగ్రెస్ అనుమతి లేకుండా అమెరికా అధ్యక్షుడు యుద్ధాన్ని ఎక్కువ కాలం కొనసాగించలేడు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఈ చట్టం వాస్తవంగా ఎంతవరకు అమలవుతోంది అన్నది పెద్ద ప్రశ్నగా మారింది వియత్నాం యుద్ధం తర్వాత అమెరికాలో ఏర్పడిన అసంతృప్తి కారణంగా 1973లో ఈ చట్టాన్ని తీసుకొచ్చారు.

2



## 200 సీట్లలో గెలుస్తాం.. విజయ్ టీవీకే ధీమా

ఎగ్జిట్ పోల్ ఫలితాలతో ఉత్సాహంగా ఉన్న విజయ్ తమిళగ వెట్రి కళగం (ఎఖ) పార్టీ తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై ధీమా వ్యక్తం చేసింది. 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చారిత్రకం కానున్నట్టు తెలిపింది. టీవీకే ఎగ్జిక్యూటివ్ చీఫ్ కోఆర్డినేటర్ కేఏ సెంగోట్టియన్ శనివారంనాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తమిళనాడులో ఏ పార్టీ మెజారిటీ సాధించకపోవడం అనే పరిస్థితి ఉండదని, టీవీకే 180 నుంచి 200 సీట్లు గెలుస్తుందని చెప్పారు. ఎన్నికల అనంతరం అన్నాడీఎంకే, ఎన్డీయేతో పొత్తుకు అవకాశం లేదని స్పష్టం చేశారు.

2



## కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతోంది ఆ ఇద్దరే: ఎంపీ అర్వింద్

కాంగ్రెస్ నేతలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దేశవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరగడానికి కారణం తెలియక రాహుల్‌గాంధీ పిల్ల చేష్టలు చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఎంపీ మాట్లాడుతూ.. చెప్పులు, దుస్తులు సరిగా వేసుకోవడానికి రాని వ్యక్తి దేశంలో ప్రధాన విపక్ష పార్టీ లీడర్ అనుకోవడానికి సిగ్గుగా ఉందన్నారు.

వార్త 2లో

# కిందస్థాయి సిబ్బందితో ఫ్రెండ్లీగా ఉండండి..



- ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలి
- కొన్ని డిపోలు నష్టాల్లో ఎందుకు నడుస్తున్నాయో సమీక్షించుకోవాలి
- సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదు
- ప్రతి రెండో మంగళవారం అన్ని డిపోల్లో గ్రీవెన్స్
- ఆర్టీసీ అధికారులతో పొన్నం ప్రభాకర్

2 లో..

ఆర్టీసీ ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశం నిర్వహించారు. నిన్న(శుక్రవారం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలకు జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశాలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కిందిస్థాయి సిబ్బంది, ప్రయాణికుల విషయంలో ఆర్టీసీ అధికారులు సానుకూలంగా ఉండాలని సూచించారు. సిబ్బందిని వేధింపులకు గురిచేయకుండా ప్రేమతో, సానుకూల దృక్పథంతో పనులు చేయించాలని డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. ఆర్టీసీ అధికారులు కింది స్థాయి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల దురుసుగా కాకుండా ఫ్రెండ్లీగా స్నేహపూర్వకంగా పనులు చేయించుకోవాలని మంత్రి అన్నారు.

## రుణమాఫీ చారాణ చేసి.. బారాణ ఎగ్గొట్టింది..



రైతన్నల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం రుణమాఫీ చారాణ చేసి.. బారాణ ఎగ్గొట్టిందని ఎద్దేవా చేశారు. ఈరోజు (శనివారం) కుకునూర్‌పల్లి మండల కేంద్రంలోని బీరప్ప ఆలయ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. హరీశ్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో పలువురు చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో సిద్దిపేట జిల్లాలో ఎక్కడలేని విధంగా బీరప్ప దేవాలయాన్ని అనాడు కేసీఆర్ చాలా చక్కగా నిర్మించారని తెలిపారు.

వార్త 2లో

## తండ్రిని విమర్శించడం కవితకు తగదు: దానం నాగేందర్

బీఆర్ఎస్ నేతలు కావాలనే రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ( తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలకు అత్యుత్సాహం ఎక్కువైందని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన వారే ఇప్పుడు ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వానికి ఆర్థికభారం ఉన్నా ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని చెప్పుకొచ్చారు. రైతులకు ఈ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తోందని.. గతంలో ఇవ్వకపోవడం కంటే ఇప్పుడు ఆలస్యంగానైనా ఇవ్వడం మంచిదే కదా అని చెప్పారు.



వార్త 2లో



## కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిపై పరువు నష్టం దావా

కామారెడ్డి ఎమ్మెల్యే తాటిపల్లి వెంకటరమణారెడ్డికి నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు పరువు నష్టం దావా నోటీసులు జారీ చేసింది. ఈ విషయాన్ని హైకోర్టు న్యాయవాది సుమంత్ వెల్లడించారు. శనివారం మీడియాతో న్యాయవాది మాట్లాడుతూ.. కేసు వివరాలను తెలియజేశారు.

2

## కెటిఆర్, హరీష్ రావుకు ఆదాయం తప్ప ప్రజా సమస్యలు పట్టవా?: అద్దంకి



2

చాలా అంశాల్లో బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు తొందర పడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆరోపించారు. ప్రతిపక్షంలో కూడా హరీష్ రావుకు ఆదాయం కావాలని అన్నారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ మీడియాతో మాట్లాడుతూ.. ఒక అంశాన్ని హరీష్ రావు తెరపైకి తీసుకొస్తారని, దానికి సంబంధించిన వారిని బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు దండుకుంటారని విమర్శించారు.

## హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం : వివేకానంద

ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని బిఆర్ఎస్ మాజీ ఎమ్ఎల్ఎ కెపి వివేకానంద ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపులేదని అన్నారు. హామీలు అమలు చేయడంలో ఫెయిల్ అయిందని విమర్శించారు.

2





2

## ఐపీఎల్ వేళ యువత ఆ తప్పు చేయవద్దు: డీసీపీ అరవింద్ బాబు..

# 60 రోజుల గడువు.. ఈ చట్టం అమెరికా అధ్యక్షుడిని ఆపగలదా..

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో, అమెరికాకు సంబంధించిన ఒక కీలక చట్టం గురించి చర్చ మొదలైంది. అదే వార్ పవర్ చట్టం (1973). ఈ చట్టం ప్రకారం, కాంగ్రెస్ అనుమతి లేకుండా అమెరికా అధ్యక్షుడు యుద్ధాన్ని ఎక్కువ కాలం కొనసాగించలేడు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఈ చట్టం వాస్తవంగా ఎంతవరకు అమలవుతోంది అన్నది పెద్ద ప్రశ్నగా మారింది వియత్నాం యుద్ధం తర్వాత అమెరికాలో ఏర్పడిన అసంతృప్తి కారణంగా 1973లో ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. అప్పట్లో అధ్యక్షుడు కాంగ్రెస్‌ను పక్కనబెట్టి ఏకపక్షంగా యుద్ధాన్ని కొనసాగించడం ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తింది. అందుకే భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు రాకుండా నియంత్రణలు అవసరమని భావించి ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. యుద్ధంపై తుది నిర్ణయం ఒక్క అధ్యక్షుడి చేతిలోనే కాకుండా, ప్రజల ప్రతినిధులైన కాంగ్రెస్ చేతుల్లో కూడా ఉండాలనే ఉద్దేశంతో ఈ చట్టాన్ని రూపొందించారు). ఈ చట్టం ప్రకారం అమెరికా అధ్యక్షుడు సైనిక చర్యలు ప్రారంభించిన 48 గంటల్లో కాంగ్రెస్‌కు సమాచారం ఇవ్వాలి. కాంగ్రెస్ అనుమతి లేకుండా గరిష్ఠంగా 60 రోజుల వరకు మాత్రమే యుద్ధాన్ని కొనసాగించవచ్చు. ఆ తర్వాత సైన్యాన్ని వెనక్కి తీసుకోవడానికి మరో 30 రోజుల గడువు తీసుకోవచ్చు. అంటే మొత్తం మీద 90 రోజుల్లో యుద్ధాన్ని ముగించాలి లేదా కాంగ్రెస్ నుంచి అధికారిక అనుమతి తీసుకోవాలి. ప్రస్తుతం ఇరాన్‌తో అమెరికా యుద్ధం ప్రారంభమై 60 రోజులు దాటింది. ఈ యుద్ధానికి కాంగ్రెస్ అనుమతి లేదఈ నేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం కీలక వాదనను ముందుకు తెచ్చింది. ఏప్రిల్‌లో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంతోనే యుద్ధం ముగిసిందని, ఆ తర్వాత సైనిక చర్యలు జరగలేదని పేర్కొంది. అంటే యుద్ధం సాంకేతికంగా కొనసాగడం లేదని, కాబట్టి 60 రోజుల గడువు నియమం వర్తించదని అంటున్నారు. అంతేకాకుండా, కొంతమంది ట్రంప్ మద్దతుదారులు మరింత ముందుకు వెళ్లి ఈ చట్టమే రాజ్యాంగ విరుద్ధమని వాదిస్తున్నారు. సైన్యానికి కమాండర్–ఇన్–చీఫ్ అయిన అధ్యక్షుడికి యుద్ధ నిర్ణయాలు తీసుకునే అధికారం ఉండాలని వాదిస్తున్నారు. కాంగ్రెస్ ఆ అధికారాన్ని పరిమితం చేయడం సరైంది కాదని అంటున్నారుఈ చట్టం అధ్యక్షుడిని పూర్తిగా ఆపగలదా అంటే.. సైద్ధాంతికంగా 'అవును' అనే సమాధానమే వస్తుంది (గ్రాతీవంఅసవత్ ఘుతీ జూశీషవతీం). అయితే ప్రాక్టికల్‌గా మాత్రం అంత సులభం కాదు. ఎందుకంటే ప్రస్తుతం అమెరికా కాంగ్రెస్‌లో విభేదాలున్నాయి. పైగా ట్రంప్‌నకు తన పార్టీ అభ్యర్థుల మద్దతు ఉంది. దీంతో అధ్యక్షుడిని కాంగ్రెస్ నియంత్రించలేదు. అలాగే, ఈ చట్టం ఉల్లంఘన జరిగితే ఏం చేయాలనే విషయంలో స్పష్టత లేదు. అధ్యక్షుడు చట్టాన్ని పక్కనబెట్టినా వెంటనే ఆపే వ్యవస్థ బలంగా లేదు. గతంలో కూడా అనేక మంది అమెరికా అధ్యక్షులు ఈ చట్టాన్ని వివిధ విధాలుగా దాటవేశారు. రకరకాల సాంకేతిక కారణాలు చెప్పి ఈ చట్టాన్ని ఉల్లంఘించారు. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడిని ఈ చట్టం ఆపగలదా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

# కిందిస్థాయి సిబ్బందితో ఫ్రెండ్లీగా ఉండండి..

## ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలి

## కొన్ని డిపోలు నష్టాల్లో ఎందుకు నడుస్తున్నాయో సమీక్షించుకోవాలి

## సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదు

## ప్రతి రెండో మంగళవారం అన్ని డిపోల్లో గ్రీవెన్స్

## ఆర్టీసీ అధికారులతో పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

ఆర్టీసీ ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశం నిర్వహించారు. నిన్న(శుక్రవారం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలకు జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశాలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కిందిస్థాయి సిబ్బంది, ప్రయాణికుల విషయంలో ఆర్టీసీ అధికారులు సానుకూలంగా ఉండాలని సూచించారు. సిబ్బందిని వేధింపులకు గురిచేయకుండా ప్రేమతో, సానుకూల దృక్పథంతో పనులు చేయించాలని డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు.
ఆర్టీసీ అధికారులు కింది స్థాయి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల దురుసుగా కాకుండా ఫ్రెండ్లీగా స్నేహపూర్వకంగా పనులు చేయించుకోవాలని మంత్రి అన్నారు. డిపో మేనేజర్లు, ఆర్టీసీ



సిబ్బంది.. ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. మే 17 లోగా డిపోలు, బస్ స్టేషన్లలో కార్మికులకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని ఆదేశించారు. టాయిలెట్స్, మంచి నీటి సౌకర్యం, ప్లాంటేషన్, పరిశుభ్రత పాటించాలన్నారు. 2023 డిసెంబర్ 9 నుంచి ఆర్టీసీలో మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఖమ్మం, మెదక్, రంగారెడ్డి, నారాయణఖేడ్, బాన్సువాడ, ఇల్లందు లాంటి కొన్ని డిపోలు నష్టాల్లో ఎందుకు నడుస్తున్నాయో ఆర్ఎంలు, డిపో మేనేజర్లు సమీక్షించుకోవాలన్నారు. టికెట్‌కు సంబంధించి ఏదైనా ఇబ్బందులు జరిగితే చర్యలు తీసుకోవాలని.. సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదన్నారు. సంస్థలో ఇంటర్నల్ ఎటాక్ అనేది ప్రమాదకరమైన విషయమని అన్నారు. ప్రతి రెండో మంగళవారం ఆర్టీసీ సిబ్బంది సమస్యలు వినడానికి అన్ని డిపోల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని.. డిపో మేనేజర్లు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్లు.. గ్రామ సర్పంచ్ నుంచి మొదలు ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మంచి ప్రజా సంబంధాలు కొనసాగించాలని సూచించారు. 'ఏదైనా సమస్య మీ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఆర్టీసీ ఎండీ స్థాయిలో పరిష్కారం చేద్దాం. సిబ్బంది పట్ల సానుకూలంగా ఉండాలి. మంత్రి నుంచి సిబ్బంది వరకు అందరం కలిసి పని చేద్దాం. ఆర్టీసీ సమ్మెలో కార్మికులు డిమాండ్ చేసిన సమస్యలను పరిష్కారం చేస్తున్నామని.. భవిష్యత్తులో మంచి ఫలితాలను సాధించే దిశగా ముందుకు వెళ్దామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. జూమ్ సమావేశంలోఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడీలు, ఆర్ఎంలు, వివిధ విభాగాల హెచ్ఓడీలు, డీఎంలు పాల్గొన్నారు.

# 200 సీట్లలో గెలుస్తాం.. విజయ్ టీవీకే ధీమా

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

ఎగ్జిట్ పోల్ ఫలితాలతో ఉత్సాహంగా ఉన్న విజయ్ తమిళగ వెట్రి కళగం (ుఎఖ) పార్టీ తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై ధీమా వ్యక్తం చేసింది. 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చారిత్రకం కానున్నట్టు తెలిపింది. టీవీకే ఎగ్జిక్యూటివ్ చీఫ్ కోఆర్డినేటర్ కేఏ సెంగోట్టియన్ శనివారంనాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తమిళనాడులో ఏ పార్టీ మెజారిటీ సాధించకపోవడం అనే పరిస్థితి ఉండదని, టీవీకే 180 నుంచి 200 సీట్లు గెలుస్తుందని చెప్పారు. ఎన్నికల అనంతరం అన్నాడీఎంకే, ఎన్డీయేతో పొత్తుకు అవకాశం లేదని స్పష్టం చేశారు. తమిళనాడు తదుపరి ముఖ్యమంత్రిగా విజయ్ 'విజనరీ పాలన' అందించనున్నట్టు చెప్పారు. విజయ్ అనేక అవాంతారాలను ఎదుర్కొని ముందుకు ప్రయాణం సాగించారని, ఇందుకు తగిన ఫలితం మే 4న వస్తుందని అన్నారు.

## ఎగ్జిట్ పోల్స్ ఏం చెప్పాయంటే..

ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ డీఎంకే తిరిగి అధికారంలోకి రానుందని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ జోస్యం చెప్పాయి. విజయ్ పార్టీ లాభపడుతుందని, అయితే భారీ విజయం సాధించే అవకాశం లేదని తేల్చిచెప్పాయి. రెండు ఎగ్జిట్ పోల్స్... యాక్సిస్ మై ఇండియా, టుడేస్ చాణక్య మాత్రం తమిళనాడులో కింగ్‌మేకర్‌గా టీవీకే నిలుస్తుందని జోస్యం చెప్పాయి. 98 నుంచి 120 నియోజకవర్గాల్లో టీవీకే గెలుస్తుందని యాక్సిస్ మై ఇండియా పేర్కొంది. 63 సీట్ల వరకూ టీవీకే గెలవచ్చని టుడేస్ చాణక్య తెలిపింది. అన్నాడీఎంకే సారథ్యంలోని ఎన్డీయే తమిళనాడులో అధికారంలోకి రాదని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ జరిగింది. 85 శాతం పోలింగ్ నమోదైంది. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

# కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిపై పరువు నష్టం దావా

కామారెడ్డి, న్యూస్‌వార్ ప్రతినిధి

కామారెడ్డి ఎమ్మెల్యే తాటిపల్లి వెంకటరమణారెడ్డికి నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు పరువు నష్టం దావా నోటీసులు జారీ చేసింది. ఈ విషయాన్ని హైకోర్టు న్యాయవాది సుమంత్ వెల్లడించారు. శనివారం మీడియాతో న్యాయవాది మాట్లాడుతూ.. కేసు వివరాలను తెలియజేశారు. గత ఫిబ్రవరి 17, 21 తేదీల్లో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ కుమారుడు ఇలియాస్‌పై రేపు కేసు ఉందని అనుచిత వ్యాఖ్యలు చేశారని, నిరాధార ఆరోపణలు చేశారని న్యాయవాది తెలిపారు. వాస్తవాలు వక్రీకరించి తన పరువుకు నష్టం కలిగించారని, ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇలియాస్ కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. దీంతో ఫిర్యాదు పూర్వాపరాలను పరిశీలించిన కోర్టు.. క్రిమినల్ డిఫెన్స్ కింద ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని ఈ నెల 20న ప్రత్యక్షంగా హాజరుకావాలని నోటీసులు జారీ చేసినట్లు న్యాయవాది సుమంత్ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో స్థానిక న్యాయవాదులు సతీష్, స్టీఫెన్ నాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతోంది ఆ ఇద్దరే: ఎంపీ అర్వింద్

హైదరాబాద్,
కాంగ్రెస్ నేతలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దేశవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరగడానికి కారణం తెలియక రాహుల్‌గాంధీ పిల్ల చేష్టలు చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఎంపీ మాట్లాడుతూ.. చెప్పులు, దుస్తులు సరిగా వేసుకోవడానికి రాని వ్యక్తి దేశంలో ప్రధాన విపక్ష పార్టీ లీడర్ అనుకోవడానికి సిగ్గుగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక చేసిందేమీ లేదని విమర్శించారు. కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకోవడంపైనే రేవంత్‌కు శ్రద్ధ అంటూ వ్యాఖ్యానించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కేసీఆర్ కోవర్ట్ అని ఎంపీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క సివిల్ సప్లై శాఖలోనే అత్యంత అవినీతి జరుగుతోందని అన్నారు. ఇరిగేషన్ శాఖలో కేసీఆర్ కోవర్ట్‌లనే ఉద్యోగులుగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం కంటే భారీ అవినీతి.. ఉత్తమ్ శాఖలో జరుగుతోందని అన్నారు. కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతోంది రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

# రుణమాఫీ చారాణ చేసి.. బారాణ ఎగ్గొట్టింది..

## కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్‌రావు సెటైర్లు

సిద్ధిపేట, న్యూస్‌వార్ ప్రతినిధి

రైతన్నల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం రుణమాఫీ చారాణ చేసి.. బారాణ ఎగ్గొట్టిందని ఎద్దేవా చేశారు. ఈరోజు (శనివారం) కుకునూర్‌పల్లి మండల కేంద్రంలోని బీరప్ప ఆలయ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. హరీశ్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో పలువురు చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో సిద్ధిపేట జిల్లాలో ఎక్కడలేని విధంగా బీరప్ప దేవాలయాన్ని అనాడు కేసీఆర్ చాలా చక్కగా నిర్మించారని తెలిపారు. ఒకప్పుడు గజ్వేల్‌లో మూగజీవాలకు నీరు, గ్రాసం దొరక్క జీవాలను మేపడానికి ఎక్కడికో వెళ్తుండేవారని.. కానీ కొండపోచమ్మ , మల్లన్నసాగర్ ప్రాజెక్టుతో నీరు, గ్రాసం కోసం వేరేవాళ్లు ఇప్పుడు మన దగ్గరకు వస్తున్నారని చెప్పుకొచ్చారు. జీవాలకు నట్టల మందు కూడా ఇవ్వడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చేతకావట్లేదని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ హయాంలో భూముల ధరలకు రెక్కలు రాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భూములను కోనేవారు, చూసేవారు లేరని హరీశ్‌రావు విమర్శించారు.

# తండ్రిని విమర్శించడం కవితకు తగదు: దానం నాగేందర్

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

బీఆర్ఎస్ నేతలు కావాలనే రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ( తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలకు అత్యుత్సాహం ఎక్కువైందని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన వారే ఇప్పుడు ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వానికి ఆర్థికభారం ఉన్నా ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని చెప్పుకొచ్చారు. రైతులకు ఈ ప్రభుత్వం రైతు భరోసా ఇస్తోందని.. గతంలో ఇవ్వకపోవడం కంటే ఇప్పుడు ఆలస్యంగానైనా ఇవ్వడం మంచిదే కదా అని చెప్పారు. ఎవరినీ వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టాలని ఈ ప్రభుత్వానికి లేదని చెప్పుకొచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రజానాయకుడు.. ఆయన ప్రజల్లో ఉంటారని.. సందర్భాన్ని బట్టి బయటకు వస్తారని చెప్పుకొచ్చారు. కవిత కలలు కనాలి కానీ కబుర్లు చెప్పొద్దని ఎద్దేవా చేశారు. సొంత తండ్రిని విమర్శించడం ఆమెకు తగదని హితవు పలికారు. తల్లిదండ్రులను గౌరవించలేని వాళ్లు ఏం మనుషులని ప్రశ్నించారు. కవిత తన ఇంటి సమస్యను బయటకు తీసుకువస్తోందని అన్నారు. ఆమె రాజకీయంగా మాట్లాడాలి కానీ సొంత తండ్రిని విమర్శించడం ఏంటి? అని మండిపడ్డారు. కేసీఆర్‌ను కవిత డీ మోరల్ చేస్తూ.. పెద్దాయనను ఇబ్బంది పెట్టడం తగదని దానం నాగేందర్ పేర్కొన్నారు.

# కెటిఆర్, హరీష్ రావుకు ఆదాయం తప్ప ప్రజా సమస్యలు పట్టవా?: అద్దంకి

హైదరాబాద్:

చాలా అంశాల్లో బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు తొందర పడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆరోపించారు. ప్రతిపక్షంలో కూడా హరీష్ రావుకు ఆదాయం కావాలని అన్నారు. ఈ సందర్భంగా అద్దంకి దయాకర్ మీడియాతో మాట్లాడుతూ.. ఒక అంశాన్ని హరీష్ రావు తెరపైకి తీసుకొస్తారని, దానికి సంబంధించిన వారిని బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు దండుకుంటారని విమర్శించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, హరీష్ రావుకు ఆదాయం తప్ప..ప్రజా సమస్యలు పట్టవా? అని ప్రశ్నించారు. అనవసర ఆరోపణలు చేసి..కాంట్రాక్టర్లను లొంగదీసుకోవాలనుకుంటున్నారని, రాజకీయ అస్థిత్వం కోసమే కెటిఆర్, హరీష్ రావు ఆరోపణలు చేస్తున్నారని అద్దంకి మండిపడ్డారు. కెటిఆర్, హరీష్ రావు బ్లాక్ మెయిల్ కు బ్రాండ్ అంబాసిడర్లు అని హ్యామ్ రోడ్లకు టెండర్లు ఎవరు వేసినా..నిబంధనలకు ప్రకారం ఖరారు చేస్తారని తెలియజేశారు. హ్యామ్ రోడ్లకు టెండర్లు ఇంకా ఖరారు కాకముందే..అనవసర ఆరోపణలు చేస్తున్నారని, కెటిఆర్, హరీష్ రావు బజారు రౌడీల మాదిరి ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ లో ఏదైనా తప్పు జరిగితే..అధిష్టానం తమ వైపు చూస్తూ ఉంటుందని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు.

# ఐపీఎల్ వేళ యువత ఆ తప్పు చేయవద్దు: డీసీపీ అరవింద్ బాబు..

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్స్‌తో మోసాలకు పాల్పడే కేటుగాళ్లపై ఉక్కుపాదం మోపుతున్నట్లు హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు తెలిపారు. సైబర్ పెట్రోలింగ్ పేరుతో సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్‌లో తప్పుడు ప్రచారాలపై నిఘా పెట్టినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్స్‌లో పెట్టుబడి పెట్టాలంటూ నకిలీ వెబ్ సైట్లు క్రియేట్ చేసి కేటుగాళ్లు ప్రచారం చేస్తున్నారని డీసీపీ పేర్కొన్నారు. ఐపీఎల్ సీజన్ నడుస్తున్నందున ఇలాంటి ప్రచారాలు జోరందుకున్నాయని తెలిపారు. అమాయకులను టార్గెట్ చేసి నిండా ముంచుతున్నారని చెప్పుకొచ్చారు.అలాంటి నేరగాళ్ల ఆట కట్టించేందుకే సైబర్ పెట్రోలింగ్ కార్యక్రమం చేపట్టినట్లు డీసీపీ అరవింద్ బాబు వెల్లడించారు. తప్పుడు ప్రచారం చేసే 427 సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను ఇప్పటివరకూ గుర్తించినట్లు డీసీపీ తెలిపారు. 1,903 పెయిడ్ ప్రమోషన్ అడ్వర్టైజ్మెంట్లను గుర్తించి తొలగించినట్లు అరవింద్ బాబు చెప్పుకొచ్చారు. వీటిని ఎక్కడి నుంచి, ఎవరు ఆపరేట్ చేస్తున్నారనే దానిపై పూర్తి దర్యాప్తు జరుగుతోందని వెల్లడించారు. యూజర్ డీటెయిల్స్ వచ్చిన తర్వాత ఎంత మంది ఆపరేట్ చేస్తున్నారనే దానిపై స్పష్టత వస్తుందని చెప్పారు. దీని వెనుక ఉన్న నెట్‌వర్క్‌పై కూపీ లాగుతున్నట్లు పేర్కొన్నారు. మోసపోయిన బాధితులు ఇప్పటివరకూ ఎవరూ ఫిర్యాదు చేయలేదని డీసీపీ చెప్పుకొచ్చారు. నిందితులని గుర్తించే పనిలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు.గేమింగ్ యాప్స్‌లో పెట్టుబడి పెడితే మొదట్లో లాభాలు వస్తాయని, ఆ తర్వాత నష్టాలు వస్తాయని డీసీపీ తెలిపారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ విధానం ద్వారా నిందితులు ఈ విధమైన మోసాలకు పాల్పడుతున్నారని వెల్లడించారు. ఐపీఎల్ సీజన్ వేళ పెట్టుబడి పెట్టాలంటూ సోషల్ మీడియాలో నేరగాళ్ల ప్రకటనలు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకూ వీటిపై ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామన్నారు. తెలంగాణలో ఆన్‌లైన్ బెట్టింగ్‌పై పూర్తి నిషేధం ఉందని.. కేటుగాళ్ల మాయలో పడొద్దని యువతకు డీసీపీ అరవింద్ బాబు విజ్ఞప్తి చేశారు.

# హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం : వివేకానంద

హైదరాబాద్:

ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని బిఆర్ఎస్ మాజీ ఎమ్ఎల్ఏ కెపి వివేకానంద ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి పట్టింపులేదని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ..నీళ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ ఫెయిల్ అయిందని వివాకానంద విమర్శించారు. గడిచిన 900 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసింది? అని ప్రశ్నించారు. 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమం ఆర్భాటం తప్ప ఏం లేదని మండిపడ్డారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం లేదని, సిఎం రేవంత్ రెడ్డి కు తన సీట్లుపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని మండిపడ్డారు. . నయవంచన పాలన అని ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఒక బూటకం అని ప్రజాపాలన పేరుతో ప్రజలను వంచించే పాలన నడుస్తుందని ఎద్దేవా చేశారు. మాజీ సిఎం కెసిఆర్ హయాంలో ఇంటింటికీ తాగునీరు ఇచ్చారని, రేవంత్ పాలనలో ఆడబిడ్డలు నీళ్లకోసం రోడ్ల మీదకు వచ్చే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గందరగోళం నెలకొందని, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ కు తప్ప ఎవరికీ భద్రత లేదని, అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరు సమీక్షించుకోవాలని వివేకానంద సూచించారు.

# శంషాబాద్ ఒఆర్ఆర్ ప్రమాద మృతులకు నివాళులర్పించిన కెటిఆర్


హైదరాబాద్: శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన ఘటనపై బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందించారు. సిరిసిల్ల బిఆర్ఎస్ నేత బొల్లి రాంమోహన్ కుటుంబ సభ్యుల మృతదేహాలకు కెటిఆర్ ఉస్మానియా ఆసుపత్రిలో నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహాలను సిరిసిల్లకు తరలించేందుకు 2 అంబులెన్స్ లు ఏర్పాటు చేశారు. శంషాబాద్ ఒఆర్ఆర్ తోండుపల్లి ఎగ్జిట్– 16 వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్నది. యాదగిరిగుట్ట దైవ దర్శనానికి వెళ్లి వస్తున్నారు. తోండుపల్లి ఎగ్జిట్ 16కు దగ్గరలో ఒఆర్ఆర్‌పై ఆగి ఉన్న లారీని వ్యాగనార్ కారు వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా ఆమెను స్థానికులు హాస్పిటల్‌కు తరలించిన సంగతి తెలిసిందే.

న్యూస్ వార్ వార్తా పత్రిక

**సంపాదకీయం...**

# ఉచితాలు అనుచితమా?

ఉచితాలు సమాజానికి శాపమా... అనే ప్రశ్న ఈ రోజు భారతదేశ ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన చర్చగా మారింది. ప్రజాస్వామ్యం అంటే ప్రజల సంక్షేమం కోసం పాలన చేయడం. కానీ ఆ సంక్షేమం అంటే ఏమిటి? అది తక్షణ ఉపశమనా లేక దీర్ఘకాల అభివృద్ధా? ఈ రెండు మధ్య ఉన్న సున్నితమైన తేడాను గుర్తించకపోతే, ప్రజాస్వామ్యం స్వయం గా దారితప్పే ప్రమాదం ఉంది. ప్రస్తుతం మనం చూస్తున్న పరిస్థితి కూడా అదే. దేశంలో ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఉచితాలు అనే పదం రాజకీయాల్లో ప్రధాన ఆయుధంగా మారింది. ప్రతి పార్టీ కూడా ప్రజలను ఆకర్షించడానికి కొత్త కొత్త పథకాల పేరుతో ఉచితాలు ప్రకటిస్తోంది. ఉచిత విద్యుత్, ఉచిత డబ్బు పంపిణీ, ఉచిత గ్యాస్, ఉచిత ప్రయాణం వంటి అనేక పథకాలు ప్రజలకు తక్షణ ఉపశమనాన్ని ఇస్తున్నట్టే కనిపిస్తున్నాయి. కానీ ఈ ఉచితాల వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి? నిజంగా ఇవి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయా? లేక ఓట్లు సాధించడానికి ఒక రాజకీయ వ్యూహమా? అనే ప్రశ్నలు తప్పనిసరిగా ఉత్పన్నమవుతున్నాయి. ఉచితాలు ఇవ్వడం అంటే తప్పు అని ఒకే పదంతో చెప్పలేం. ఎందుకంటే కొన్ని సందర్భాలలో ప్రభుత్వ జోక్యం అవసరం అవుతుంది. పేదరికం, ఆకలి, ఆరోగ్య సమస్యలు, విద్య లోపం వంటి అంశాలలో ప్రభుత్వం సహాయం చేయడం సమాజానికి అవసరం. ఉదాహరణకు, పేద విద్యార్థులకు ఉచిత విద్య, పేదలకు ఉచిత వైద్యం వంటి పథకాలు సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే పునాది లాంటివి. ఒక దేశ అభివృద్ధికి అవసరమైన మౌలిక హక్కులు. కానీ అదే సమయంలో ప్రతి అంశాన్ని ఉచితంగా మార్చడం, ప్రతి అవసరాన్ని ప్రభుత్వంపై ఆధారపడి తీర్చుకోవడం ఒక ప్రమాదకర దిశగా తీసుకెళ్తుంది. ఉచితాల రాజకీయాలు తాత్కాలికంగా ప్రజలకు ఆనందాన్ని ఇస్తాయి. ఎన్నికల సమయంలో ఇది మరింత ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఎందుకంటే ఒక వ్యక్తి తన రోజువారీ సమస్యలతో బాధపడుతున్నప్పుడు, అతనికి తక్షణ ఉపశమనాన్ని ఇచ్చే ఏ పథకమైనా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కానీ దీర్ఘకాలంలో ఈ పథకాల ప్రభావం ఎలా ఉంటుందో చాలా మంది ఆలోచించరు. ఒక సమాజం నిరంతరం ఉచితాలపై ఆధారపడితే, క్రమంగా కష్టపడి సంపాదించే భావన తగ్గిపోతుంది. స్వయం సమర్థత క్షీణిస్తుంది. వ్యక్తి తన సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించకుండా, ప్రభుత్వంపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుంది. యువత అనేది ఒక దేశానికి బలం. వారి కృషి, ఆలోచనలు, సృజనాత్మకత దేశాన్ని ముందుకు నడిపిస్తాయి. కానీ అదే యువత ఉచితాలవల్ల అలసత్వానికి లోనైతే, దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. చదువుకున్న యువకులు కూడా తమకు తగిన అవకాశాలు దొరకక చిన్న చిన్న ఉద్యోగాలలోనే నిలిచిపోతున్నారు. ఇది కేవలం వారి వైఫల్యం కాదు. ఇది ఒక వ్యవస్థలోని లోపం. విద్యావ్యవస్థ సరైన నైపుణ్యాలను అందించకపోవడం, పరిశ్రమల అభివృద్ధి లేకపోవడం, ప్రభుత్వ విధానాల్లో స్పష్టత లేకపోవడం, ఈ కారకాలన్నీ కలిసి ఈ పరిస్థితిని సృష్టిస్తున్నాయి. ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఆర్థిక పరిపాలన. ఒక ప్రభుత్వం ఉచితాలు ప్రకటించడానికి ముందు, ఆర్థిక వనరులు ఎలా సమకూర్చుకుంటుందో ఆలోచించాలి. ఆదాయం లేకుండా ఖర్చులు పెంచితే, అప్పులు తప్పవు. అప్పులు పెరిగితే, భవిష్యత్ తరాలపై భారమవుతుంది. ఈ రోజు తీసుకునే నిర్ణయాలు రేపటి తరాలకు ప్రభావం చూపుతాయి. కానీ ఎన్నికల రాజకీయాల్లో ఈ దీర్ఘకాల ఆలోచన చాలా సందర్భాల్లో కనిపించదు. తక్షణ ప్రయోజనాల కోసం భవిష్యత్తును తాకట్టు పెట్టే పరిస్థితి ఏర్పడుతోంది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని గమనిస్తే చాలా చోట్ల అప్పులు పెరుగుతున్నాయి. ఒక ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గత ప్రభుత్వంపై నిందలు వేయడం ఒక సాధారణ ధోరణిగా మారింది. వాళ్లు అప్పులు చేసి వెళ్లారు అనే వాదన వినిపిస్తుంది. కానీ అదే సమయంలో కొత్తగా కూడా అప్పులు తీసుకుంటూ ఉచిత పథకాలను కొనసాగించడం ఒక విరుద్ధమైన పరిస్థితి. ప్రజలు కూడా ఈ విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉంది. ఒక ప్రభుత్వాన్ని కేవలం హామీల ఆధారంగా కాకుండా, ఆ హామీలను అమలు చేసే సామర్థ్యాన్ని బట్టి అంచనా వేయాలి. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక శక్తి. ఆ శక్తిని ఎలా ఉపయోగించాలో ప్రజలపై ఆధారపడి ఉంటుంది. ఒక ఓటు ద్వారా మనం ఒక ప్రభుత్వాన్ని ఎంచుకుంటాం. ఆ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు మన జీవితాలను ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఓటు వేసేటప్పుడు తక్షణ ప్రయోజనాలను కాకుండా, దీర్ఘకాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలి. ఉచితాలు ఇచ్చే పార్టీని కాకుండా, అవకాశాలు సృష్టించే పార్టీని ఎంచుకోవాలి. ఇవి ఉచితంగా అందించాల్సిన అత్యవసర రంగాలు. ఎందుకంటే ఒక వ్యక్తి చదువుకున్నప్పుడు, అతను తన జీవితాన్ని మార్చుకునే సామర్థ్యాన్ని పొందుతాడు. ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడు, అతను సమాజానికి ఉపయోగపడగలడు. కాబట్టి ఈ రెండు రంగాలలో పెట్టుబడి పెట్టడం ఖర్చు కాదు, అది ఒక పెట్టుబడి. ఇది దేశ భవిష్యత్తును నిర్మించే పునాది. అదే సమయంలో మిగతా రంగాలలో ఉచితాల కంటే అవకాశాలు ఇవ్వడం ముఖ్యమైనది. ఉద్యోగాలు సృష్టించడం, పరిశ్రమలను ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం, వ్యవసాయానికి మద్దతు ఇవ్వడం వంటి అంశాలు సమాజాన్ని స్థిరంగా ముందుకు తీసుకెళ్తాయి. ఒక రైతుకు ఉచిత డబ్బు ఇవ్వడం కంటే, అతనికి సరైన ధర, నీరు, మార్కెట్ ఇవ్వడం ఎక్కువ ప్రయోజనకరం. ఒక యువకుడికి ఉచిత సబ్సిడీ ఇవ్వడం కంటే, అతనికి ఉద్యోగం లేదా వ్యాపారం చేసే అవకాశాన్ని కల్పించడం ఉత్తమం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు కాకపోవడం ప్రజల్లో నిరాశను కలిగిస్తుంది. ఇది ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని కూడా దెబ్బతీస్తుంది. ఒక నాయకుడు చెప్పిన మాట నిలబెట్టుకోకపోతే, ప్రజలు రాజకీయ వ్యవస్థపై విశ్వాసం కోల్పోతారు. ఇక ప్రజల పాత్ర గురించి మాట్లాడితే, మార్పు ఎక్కడి నుండి వస్తుంది అనే ప్రశ్నకు సమాధానం స్పష్టంగా ఉంది, ప్రజల నుంచే. ఒక సమాజం చైతన్యవంతంగా మారితే, రాజకీయాలు కూడా మారతాయి. ప్రజలు తమ హక్కులను మాత్రమే కాకుండా, తమ బాధ్యతలను కూడా గుర్తించాలి. ఉచితాల కోసం కాకుండా, అభివృద్ధి కోసం ఓటు వేయాలి. అప్పుడు మాత్రమే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. సామాజిక సంస్థలు, విద్యావేత్తలు, మేధావులు కూడా ఈ మార్పులో కీలక పాత్ర పోషించాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. ఉచితాలవల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించాలి. దీర్ఘకాల అభివృద్ధి ప్రాముఖ్యతను తెలియజేయాలి. మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. సంచలనం కంటే సత్యాన్ని చూపాలి. మొత్తంగా చూస్తే, ఉచితాల రాజకీయాలు పూర్తిగా శాపమని చెప్పలేం. కానీ అవి నియంత్రణ లేకుండా కొనసాగితే, సమాజానికి నష్టం కలిగించే అవకాశం ఉంది. అవసరమైన చోట ఉచితాలు ఉండాలి, కానీ అవి ఒక వ్యూహంగా మారకూడదు. ప్రజల సంక్షేమం అనే పేరుతో ఓట్లు కొనే ప్రయత్నం ఆగాలి. ఈ రోజు మనం ఒక కీలక దశలో ఉన్నాం. ఒక దిశలో కొనసాగితే, మనం ఆధారపడి జీవించే సమాజంగా మారిపోతాం. మరో దిశలో ముందు కు సాగితే, మనం స్వయం సమర్థతతో అభివృద్ధి చెందే సమాజంగా మారగలం. ఈ ఎంపిక మన చేతుల్లోనే ఉంది. ప్రశ్న మళ్లీ అదే.. మార్పు ఎవరు తెస్తారు? జవాబు కూడా అదే, మనమే. ప్రజలు మేలుకుంటే, రాజకీయాలు మారతాయి. నాయకులు కూడా మారాల్సి వస్తుంది. హామీలు ఇవ్వడమే కాదు, వాటిని నిలబెట్టుకోవాల్సి వస్తుంది. ఆ రోజు తప్పకుండా వస్తుంది. కానీ అది స్వయంగా రాదు. మన ఆలోచనల్లో మార్పు వచ్చినప్పుడే, మన ఓటులో మార్పు వచ్చినప్పుడే, మన సమాజంలో మార్పు వస్తుంది. అందుకే ఇప్పుడు అవసరం, చైతన్యం, బాధ్యత, దీర్ఘకాల దృష్టి. ఉచితాల మాయ నుండి బయటపడి, అభివృద్ధి మార్గంలో నడవాల్సిన సమయం ఇదే.




# రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా కష్టపడుతున్నా

**ప్రజల సంతోషం చూసి కష్టాలు మరచి పోతున్నా**

**ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రానికి పూర్వ వైభవం**

**లేబర్ అడ్డాలను స్కిల్ సెంటర్లుగా అభివృద్ధికి నిర్ణయం**


**గోదావరి పుష్కరాల్లోపే పోలవరం పూర్తి చేస్తాం**

**విద్యుత్ చార్జీలు పెంచలేదు..ఇకముందు పెంచబోం**

**కృష్ణా జిల్లా పమిడిముక్కలలో 'పేదల సేవ'లో సీఎం బాబు**

విజయవాడ

రాష్ట్రాభివృద్ధి కోసం రాత్రిపగలు కష్టపడుతున్నామని, పేదల రుణం తీర్చుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజల సంతోషాన్ని చూసి.. కష్టాన్ని మరిచిపోతున్నట్లు చెప్పారు. కృష్ణా జిల్లా పమిడిముక్కలలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని, ఏపీకి పూర్వవైభవం తీసుకొస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పింఛన్ల కోసం ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. పింఛన్ల పంపిణీని భారంగా భావించట్లేదు.. బాధ్యతగా భావిస్తున్నామని చంద్రబాబు అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వట్లేదు. కార్మికుల కోసం లేబర్ అడ్డా నిర్మాణాలు చేపడుతున్నాం. లేబర్ అడ్డాలు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా మారాలి. పని ఉంటే పనికెళ్తారు.. లేని రోజు లేబర్ అడ్డాల్లో నైపుణ్యం పెంచుకుంటారు. తొలి దశలో లేబర్ అడ్డాలు విజయవంతమైతే.. మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తాం అని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ప్రస్తుతం మళ్లీ వెయ్యి కోట్లతో పోలవరం డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తున్నాం. 2027లో గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేస్తాం. ఆ తర్వాత కృష్ణా నదికి అనుసంధానిస్తాం. డిసెంబర్ నాటికి బందర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేస్తాం. హైదరాబాద్- మచిలీపట్నం హైవే ఎక్స్‌ప్రెస్ రోడ్డుగా అభివృద్ధి చెందుతోంది. విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. ఇప్పటి వరకు పెంచలేదు. ఎన్నికలయ్యే వరకు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇస్తున్నానని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వం విధించిన ట్రూఅప్ ఛార్జీలను ట్రూడౌన్ చేశాం. గత ప్రభుత్వం 9సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని విమర్శించారు. ఇకపై ప్రతి సమావేశంలోనూ ఎమ్మెల్యే పనితీరు గురించి ప్రజలనే అడుగుతా. ఎమ్మెల్యే పనితీరు సరిగా లేకుంటే.. వారికి ఇంకొక ఛాన్స్ ఉండదు. అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలులో ఈఎస్ఐ ఆస్పత్రులు తీసుకొస్తాం. శ్రీసిటీ, తిరుపతి, అమరావతిలో ఈఎస్ఐ ఆస్పత్రులు తీసుకొస్తాం. అందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే మా లక్ష్యం. నేర ప్రవృత్తి వ్యక్తులు రాజకీయాలకు పనికిరారు. వైకాపా అధినేతకు మానసిక సమస్య ఉంది. ఒకసారి అవకాశమిస్తే అందర్నీ మోసం, నాశనం చేశారు. ప్రజావేదికను నిర్మిస్తే.. రెండు గంటల్లో కూల్చేశారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టును నాశనం చేశారు. అమరావతిని శ్మశానం అని ప్రచారం చేశారు. పోలవరం పూర్తయి ఉంటే.. రైతులు బంగారం పండించేవారు. నీటి ఎద్దడి ఉండేది కాదు. గొడ్డలి పార్టీకి మద్దతిచ్చేవారు ఒకసారి ఆలోచించుకోండి. బాబాయిని హత్య చేసి గుండెపోటు



అన్నారు. మరుసటి రోజు నా చేతిలో కత్తి పెట్టి.. నారాసుర రక్త చరిత్ర అని 'సాక్షి'లో రాశారు. విపక్షంలో ఉండేది వైకాపా కాదు.. గొడ్డలి పార్టీ అని చంద్రబాబు అన్నారు. ఈమేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పార్టీ కాదని.. కోడికత్తి, గొడ్డలి పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. జగన్‌కు మానసిక సమస్య ఉందని సెటైర్లు గుప్పించారు. ప్రజలు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని నాశనం చేశారని.. అలా చేయడమే ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు. ఆయన మానసిక పరిస్థితి అందరినీ మోసం చేయడమేనని.. ఆ తర్వాత మాట మార్చడమే పనిగా పెట్టుకున్నారని ఆక్షేపించారు.

2019లో అధికారంలోకి వచ్చిన తొలి సమావేశంలోనే ప్రజావేదికను కూల్చేశారని ధ్వజమెత్తారు. రెండేళ్లు కష్టపడి కడితే.. రెండు గంటల్లోనే దానిని కూల్చేశారని మండిపడ్డారు. అమరావతి రాజధాని కావడంతో స్థానిక రైతుల దశా దిశ మారిపోయిందని చెప్పుకొచ్చారు. విశాఖపట్నం తర్వాత అభివృద్ధి, ఆదాయంలో ముందుండేది కృష్ణా జిల్లా అని పేర్కొన్నారు. కార్మికుల కోసం అత్యాధునిక పనిముట్లతో తొలి దశలో 15 నగరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను నిర్మిస్తామని ఉద్ఘాటించారు. తొలి దశలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు విజయవంతమైతే.. మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తామని చెప్పుకొచ్చారు. తానూ రైతు కుటుంబం నుంచే వచ్చానని.. వారి కష్టం తనకు తెలుసునని ప్రస్తావించారు. జగన్ హయాంలో ప్రజలు, నేతలు బయట తిరిగే పరిస్థితి లేదని పేర్కొన్నారు.ఏపీలో ప్రజలందరికీ మరో స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిన ఘనత ఎన్డీఏదేనని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రతి సమావేశంలో ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజలనే అడుగుతానని అన్నారు. ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేకుంటే.. వారికి మరోసారి సీటు ఇచ్చే ఛాన్స్ ఉండదని స్పష్టం చేశారు. పోలవరం కోసం కష్టపడి తాము 70 శాతానికి పైగా పనులు పూర్తి చేశామని.. అలాంటి ప్రాజెక్టును నాశనం చేసి.. జగన్ హయాంలో ఆ పనులు నిలిపివేశారని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. అమరావతి ప్రజా రాజధాని.. మన మైథాలజీలో దేవతల రాజధాని అని అభివర్ణించారు. అలాంటి అమరావతిని ఎడారి అని, శ్మశానమని మొత్తం నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణం చేస్తుంటే.. వారు విధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. మళ్లీ అలాంటి విధ్వంసకర పాలన అధికారంలోకి రాకూడదని ప్రజలు గుర్తించాలని అన్నారు. నరకాసుడి వధ కారణంగా మనం దీపావళి చేసుకుంటున్నామని.. దుర్మార్గుడు చనిపోయారని.. సమాజం బాగుపడింది.. అంటే అలాంటి వారిని మళ్లీ సమర్థించకూడదని అర్థమని అన్నారు. ప్రతి ఒక్కరూ మీ గుండె మీద చేయి వేసుకుని ఆలోచన చేయాలని కోరారు. 2019లో జగన్ మోసాలు తెలుసుకోకుండా.. ఓట్లు వేసి 151 సీట్లు ఆయనకు ఇచ్చి గెలిపించారని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. జగన్ హయాంలోని ఐదేళ్ల విధ్వంసకర పాలన చేశారని ఆగ్రహించారు. తాను, మోదీ, పవన్ కల్యాణ్ కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తే 94శాతం సీట్లతో గెలిపించారని తెలిపారు. తాను అభివృద్ధి చేయడం.. ఆ తర్వాత ఎవరో వచ్చి నాశనం చేయడం ఇలా అవసరమా అని ప్రశ్నించారు. ప్రజలంతా ఆలోచన చేసి.. మరోసారి ఎన్డీఏకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.. సుపరిపాలన ఇచ్చే బాధ్యత తమదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సమావేశంలో మంత్రి వాసంశెట్టి ఇసుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# 20పైగా అంశాలకు కేబినేట్ ఆమోదం

**ఢిల్లీలో రూ.124.50 కోట్లతో కొత్త ఏపీ భవన్ నిర్మాణం**

**క్వాంటం వ్యాలీ ట్విన్ టవర్ల నిర్మాణానికి రూ.1,208 కోట్లు**

**మార్క్‌ఫెడ్‌కు రూ.1800 కోట్ల రుణం పొందేందుకు గ్యారెంటీ**

**ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనల్లో సవరణ**

అమరావతి,

ఉద్యోగ, మౌలిక వసతులు, వ్యవసాయం, పట్టణాభివృద్ధి, పెట్టుబడుల వంటి అంశాలపై క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన దాదాపు మూడున్నర గంటలపాటు సమావేశమైన మంత్రివర్గం.. దాదాపు 20కిపైగా అజెండా అంశాలకు ఆమోదం తెలిపింది. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్.. క్యాబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. దిల్లీలో 11.5 ఎకరాల్లో రూ.124.50 కోట్లతో కొత్త ఏపీ భవన్ నిర్మాణానికి మంత్రివర్గం పచ్చజెండా ఊపిందన్నారు. మున్సిపాలిటీలకు చెందిన ఆస్తుల లీజ్ రెన్యువల్, అద్దె నిర్ణయ విధానాల సవరణలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో మ్యుటేషన్ ఛార్జీలను ఒకే విధంగా అమలు చేసే చట్టసవరణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. దిల్లీలోని ఏపీ భవన్‌లో అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ కార్యాలయంలో ఆఫీస్ మేనేజర్ పోస్టును సెక్షన్ ఆఫీసర్‌గా అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేసింది. రామాయపట్నంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు రూ.354 కోట్ల మేర పాలనా అనుమతులకు అంగీకారం తెలిపింది. ఏపీ మార్క్‌ఫెడ్‌కు రూ.1800 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చే ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేసింది. అమరావతిలో క్వాంటం వ్యాలీ ట్విన్ టవర్ల నిర్మాణానికి రూ.1,208 కోట్ల వ్యయానికి అంగీకారం తెలిపింది. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ 2000 బ్యాచ్‌కు చెందిన 385 మంది కానిస్టేబుళ్లను హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతికి పచ్చజెండా ఊపింది. హైకోర్టు, జిల్లా న్యాయస్థానాల్లో 21 కొత్త పోస్టులు సృష్టించేందుకు అంగీకారం తెలిపింది. రూ.2,540 కోట్లతో అమరావతిలో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. కృష్ణానది ఫ్లడ్ ప్రొటెక్షన్ పనులతో పాటు అమరావతిలోని సచివాలయం గ్లాస్ క్లాడింగ్ పనులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనల్లో సవరణలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పోలవరం ప్రాజెక్ట్ బాధితులకు గృహ యూనిట్ ఖర్చు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ పరిసరాల్లో సివిల్ వర్క్స్ కోసం రూ.798 కోట్ల ప్రణాళికతో పాటు ఉండవల్లి జోన్‌లో మౌలిక వసతుల కోసం రూ.580 కోట్ల ప్రణాళికకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది.

# కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్దిక పెద్దపీట

**జగన్ విధ్వంసంతో రాష్ట్రంలో అభివృద్ధి వెనుకంజ**

**రామచంద్రాపురంలో పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి అనిత**

అనకాపల్లి,

కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయని హోం మంత్రి అనిత వెల్లడించారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. గత ప్రభుత్వం దెబ్బతీసిన వ్యవస్థలను పునరుద్ధరించడంతో పాటు, చంద్రబాబు అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం పర్యటించారు. కోటవురట్ల మండలం రామచంద్రపురం గ్రామంలో హోం మంత్రికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. రామచంద్రపురం గ్రామంలో హోంమంత్రి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం రామచంద్రపురం గ్రామంలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కోటవురట్ల మండలం సుంకుపురు గ్రామంలో గంగమ్మ తల్లి పండగ సందర్భంగా అమ్మవారిని అనిత దర్శించుకున్నారు. ఆపై హోం మంత్రి మాట్లాడుతూ... అంకితభావం, కృషితో సమాజాన్ని ముందుకు నడిపిస్తున్న శ్రామిక సోదర సోదరీమణులందరికీ అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మికులు, కర్షకులే దేశ ఆర్థిక వ్యవస్థకు పునాది అని అన్నారు. రెండోసారి పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా తనకు అవకాశం



కల్పించినందుకు సీఎం చంద్రబాబు, నారా లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా రెండవసారి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. రామచంద్రపురం గ్రామంలో కోటి 16 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. 2014 -19 సమయంలో పందూర్ బ్రిడ్జిని శంకుస్థాపన చేస్తే... మరలా ఎన్డీఏ ప్రభుత్వంలోనే బ్రిడ్జి పనులు పూర్తి చేశామని చెప్పారు. దేశంలోనే అత్యధికంగా పింఛన్లు ఇచ్చే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఔఖీఇఉ÷ూ రూ.40 కోట్లు, ఆర్ అండ్ బి నుంచి 40 కోట్ల రూపాయలతో వివిధ పనులు చేసినట్లు తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పరిశ్రమల రాకతో పెద్ద సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు రానున్నాయన్నారు. స్టీల్ ప్లాంట్ రాకతో ఈ ప్రాంతం రూపు రేఖలు మారనున్నాయని, కోటవురట్ల మండలంలో కూడా పరిశ్రమలు తీసుకొస్తామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

# అల్లందేవి చెరువు పాఠశాలలో ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ సహకారంతో తరగతి గదుల నిర్మాణం

### బడిబాట కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రకటన



**సంస్థాన్ నారాయణపురం మే 2 (న్యూస్ వార్ ) :**

అల్లందేవిచెర్వు గ్రామంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి సుర్వి సౌజన్య రాజు గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకసేన ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు, ముఖ్యంగా పిల్లల తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతను వివరించారు. గ్రామంలో ప్రస్తుతం ఉన్న పాఠశాలలో ఇఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ సహకారంతో ఐదు తరగతి గదులతో నూతన భవనం నిర్మాణం జరుగుతున్నదని తెలియజేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ ఉపాధ్యాయులను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాఠశాల సమయం అనంతరం విద్యార్థులకు ప్రత్యేకంగా ట్యూషన్ సదుపాయం కూడా కల్పించబడుతుందని పేర్కొన్నారు. దీంతో పిల్లలకు మంచి విద్యా వాతావరణం అందించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రజలు ప్రభుత్వ పాఠశాలపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తామని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముక్కర్ల కవిత స్వామి యాదవ్ వార్డు సభ్యులు అంతటి శివశంకర్ గౌడ్,మాజీ వార్డు సభ్యులు గుండు జంగయ్య గౌడ్, విద్యా కమిటీ చైర్మన్ సుర్వి అలివేలు,అంగన్వాడి టీచర్ సుర్వి ప్రేమలత,గ్రామ పెద్దలు,మహిళలు, తల్లిదండ్రులు,పిల్లలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చేనేత సహకార సంఘం లో సభ్యత్వం కల్పించండి



**చౌటుప్పల్ మే 2 (న్యూస్ వా ర్)**

చౌటుప్పల్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేనేత వృత్తిపై ఆధారపడి జియో ట్యాగ్ కలిగి దరఖాస్తు చేసుకున్న నేత కార్మికులందరికీ చేనేత సహకార సంఘంలో సభ్యత్వం కల్పించాలని చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు కర్నాటి జనార్ధన్ ఆధ్వర్యంలో చేనేత కార్మికులు యాదాద్రి జిల్లా ఏడికి వినతి పత్రం సమర్పించారు.

# ఉపాధినిచ్చే సాంకేతిక విద్యా కోర్సులను విద్యార్థులు ఎన్నుకోవాలి

**చౌటుప్పల్ మే 2 (న్యూస్ వార్ )**

పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు కేవలం సంప్రదాయ కోర్సులకే పరిమితం కాకుండా వంద శాతం ఉపాధి గ్యారెంటీ ఇచ్చే సాంకేతిక వృత్తి విద్యా కోర్సుల వైపు దృష్టి సారించాలని యాదాద్రి భువనగిరి జిల్లా చేనేత మరియు జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీ ఎ. శ్రీనివాసా రావు పిలుపునిచ్చారు. శనివారంనాడు చౌటుప్పల్ మండలంలోని విద్యార్థులకు హైదరాబాద్ లోని కొండా లక్ష్మణ్ బాపూజి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ ఎ. శ్రీనివాస రావు సదస్సును ఉద్దేశించి మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరానికి గాను డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్ టెక్స్టైల్ టెక్నాలజీ కోర్సు యొక్క విశిష్టతను మరియు ప్రభుత్వ ప్రోత్సాహకాలను వివరించారు. అదే విధంగా నేటి ఆధునిక కాలంలో చేనేత రంగం కేవలం మగ్గానికి మాత్రమే పరిమితం కాలేదని, విద్యార్థులకు కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్ టెక్స్టైల్ కెమిస్ట్రీ మరియు స్మార్ట్ గార్మెంట్ తయారీ వంటి అంతర్జాతీయ స్థాయి అంశాలలో శిక్షణ ఇస్తుంది అని తెలిపారు. విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం ప్రతి నెలా రూ. 2500/- స్టైఫండ్ అందిస్తుందని, చేనేత కుటుంబాల వారికి అదనపు వెసులుబాటుగా ప్రతి నెలా రూ. 5,000/- స్టైఫండ్ ఉంటుందని పేర్కొన్నారు. ఏడాదికి కేవలం రూ. 4250/- నామమాత్రపు ఫీజుతో నాణ్యమైన సాంకేతిక విద్యను అభ్యసించే ఈ సువర్ణ అవకాశాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ప్రముఖ వస్త్ర పరిశ్రమలలో డిజైనర్లుగా, మేనేజర్లుగా స్థిరపడే గొప్ప అవకాశం ఉంటుందని ఆకాంక్షించారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులు మే 10 లోపు శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ప్రాంగణం, నాంపల్లి, హైదరాబాద్. దరఖాస్తు చేసుకోవచ్చని, మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామని తెలియజేశారు.



# మే డే సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన ఇ ఎల్ వి భాస్కర్



మే డే అంటే....... ఆ రోజు కార్మికులందరినీ పోగేయడం, ర్యాలీలు తీయడం, పార్టీ జెండాలు ఎగరేయడం, అమరులకు జేజేలు కొట్టియ్యడం, తమ హంగు ఆర్భాటం ప్రదర్శించుకోవడం, ఇప్పటివరకు మే డే రోజు వివిధ పార్టీల నాయకులైతేనేమి, కార్మిక యూనియన్ల నాయకులయితేనేమి తమ అంగ బలం అర్ధ బలం ప్రదర్శించడం తద్వారా కార్మికులందరూ మాకు అండగా ఉన్నారంటూ యాజమాన్యం వద్ద ప్రచారం చేసుకోవడం ఇదే ప్రతి సంవత్సరం మేడే రోజు జరిగే తంతు కానీ అందుకు భిన్నంగా కార్మికులతో మమేకమై మీకు నేనున్నాను మీరందరూ నా వాళ్లే అంటూ భరోసా కల్పించి వారిలో ఒకడిగా వారి బాధలు విని వారికి చేతనైనంత సహాయం చేయాలనుకున్న ఒక వ్యక్తి ఈరోజు మన కళ్ళ ముందు ఆవిష్కృతమైనాడు.

## అతడు రాజకీయ నాయకుడు కాదు కార్మిక నాయకుడు కాదు

కానీ జనహృదయనేతగా జేజేలు కొట్టించుకుంటున్న వ్యక్తి......

అతడే ఇఎల్ వి భాస్కర్. తన భాస్కర్ ఫౌండేషన్ ద్వారా మునుగోడు నియోజకవర్గం లోని పారిశుద్ధ్య కార్మికులందరినీ మే డే రోజున ఒక్క చోటికి చేర్చి కుటుంబ సభ్యులుగా ఆదరించి ఒక అన్న ఆడపడుచులను ఆదరించినట్లు చీర జాకెట్ పెట్టి గౌరవించాడు. అన్నదమ్ముల్లాంటి కార్మికులందరికీ అంగవస్త్రాలు ఇచ్చి సత్కరించాడు. అందరితో కలిసి భోజనం చేశాడు. సఫాయి కార్మికులకు ఇలాంటి మే డే సత్కారం ఒక అపూర్వమైన ఘటనగా వర్ణించవచ్చు. వివరాల్లోకి వెళితే మేడే దినోత్సవం పురస్కరించుకొని భాస్కర్ ఫౌండేషన్ వారు మునుగోడు నియోజకవర్గం లోని పారిశుద్ధ్య కార్మికులందరినీ చండూరు పట్టణంలోని గోకుల్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ సభకు పాటల వెంకన్నగా పేరుగాంచిన బొమ్మరబోయిన వెంకన్న సమన్వయకర్తగా వ్యవహరించగా పలువురు ఇఎల్ వి ఫౌండేషన్ సభ్యులు తమ అనుభవాలను పంచుకున్నారు. చండూర్ కౌన్సిలర్ కొండ్రెడ్డి మధు ముందుగా మాట్లాడుతూ ఆత్మీయ సమావేశానికి విచ్చేసిన అందరికీ మే డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. తర్వాత రావిరాల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మే డే సందర్భంగా ఫౌండేషన్ తరపున సఫాయి కార్మికులందరిని సన్మానించాలనేటువంటి భాస్కర్ ఆలోచన ఎంతో ఉన్నతమైనదని కరోనా కాలంలో పారిశుద్ధ్య కార్మికుల ప్రాముఖ్యత ఎంతో ప్రజలందరూ గుర్తించారని కాలక్రమేన అందరూ వీరిని మర్చిపోయినప్పటికిని ఫౌండర్ భాస్కర్ ఈరోజున విరిని ప్రత్యేకంగా సన్మానించడం సంతోషంగా ఉన్నది అని అన్నారు. కావలి యాదగిరి మాట్లాడుతూ నాటి గణ రాజ్యాలు మొదలు నేటి పెట్టుబడిదారీ వ్యవస్థ వరకు దోపిడీకి గురి అవుతున్న వ్యక్తి సామాన్య మానవుడైన కార్మికుడైనని వెట్టి నుండి మొదలైన పని నేడు యాంత్రీకం అయిపోయిందే తప్ప మార్పు ఏమీ లేదని అన్నారు. ఆదిమానవుని కాలం నుంచి ఆధునిక కాలం వరకు కొనసాగిన పారిశ్రామిక విప్లవం ద్వారా బూర్జువా పెట్టుబడిదారీ వ్యవస్థ పెరిగిందే తప్ప కార్మికులకు ఒరిగిందేమీ లేదని ఆవేదన వెలిబుచ్చారు.

## మీ అండగా నేనుంటా మీలో ఒకడిగా నేనుంటా

ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండర్ అధినేత భాస్కర్ మాట్లాడుతూ తాను ఈ సమావేశాన్ని ఏర్పరిచింది ఉపన్యాసాలు ఇవ్వడానికి కాదని, సమాజానికి ఎంతో సేవ చేస్తున్నప్పటికిని ఏమాత్రం గుర్తింపుకు నోచుకోని కార్మిక బంధువులందరిని మే డే రోజు కలుసుకొని వారితో ఆత్మీయంగా నాలుగు మాటలు మాట్లాడి తనకు చేతనైనంతలో వారికి బట్టలు పెట్టి సత్కరించాలని, భోజనం పెట్టి తృప్తి చెందాలనే ఉద్దేశంతోటే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తన ప్రస్థానం కూడా ఒక కార్మికుడుగానే మొదలైందని అట్టడుగు వర్గాల నుంచి తన ఎదుగుదల జరిగిందని తెలియజేశారు తన తల్లిదండ్రులు కూడా కార్మికులుగా పనిచేసిన వారేనని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు తమకు గత ఏడు నెలలుగా జీతాలు అందట్లేదని తమ బాధను వెలిబుచ్చారు దీనితో చెల్లించి పోయిన భాస్కర్ మీకు అండగా నేనుంటాను. అందరం కలిసి పోరాటం చేద్దామని వారిలో ధైర్యాన్ని నింపారు. సామరస్య పూర్వకంగా జీతాల కోసం పోరాడమని ఒకవేళ జూన్ 10 వరకు కూడా జీతాలు అందకపోతే చండూరు సెంటర్లోనే టెంటు వేసి ధర్నా చేద్దామని, అవసరమైతే తాను నిరాహార దీక్ష కూడా చేయటానికి సిద్ధంగా ఉన్నానంటూ వారికి భరోసా కల్పించారు. కార్మికులందరూ తమ తర్వాత తరం అయినటువంటి పిల్లల భవిష్యత్తుపై శ్రద్ధ పెట్టాలని అందుకు అవసరమైన సహాయ సహకారాలు తన నుంచి ఉంటాయంటూ హామీ ఇచ్చారు. ఈ ప్రాంతం వెనుకబడి పోవడానికి దారిద్రంలో మగ్గటానికి నీరు లేకపోవడమే మూల కారణమని శివన్నగూడ రిజర్వాయర్ ఏర్పాటయితే పంటలు బాగా పండుతాయి అంటూ తద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించి పిల్లలను కూడా ఉన్నతమైన చదువులు చదివించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దడానికి అవకాశం ఉంటుందని అందుకోసం అందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. చండూరులో ఇంత పెద్ద ఆత్మీయ సభ నిర్వహించడానికి ఇంతమంది కార్మిక సోదరి సోదరులను కలుసుకోవడానికి వెనక ఇద్దరు వ్యక్తుల కఠోర శ్రమ ఉందని చండూరు పట్టణానికి చెందిన రావిరాల రాజేంద్రప్రసాద్, బొల్లెపల్లి హరికృష్ణ ఇద్దరు అహర్నిశం శ్రమించి ఈ ఆత్మీయ సభ విజయవంతం ఇవ్వడానికి కృషి చేశారని తెలియజేస్తూ వేదికపై వారిద్దరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# మీ వెంటే మేమున్నాం.. మీ కష్టాలను తీరుస్తాం!

### బోదులబండ ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి అభయం

నేలకొండపల్లి : "మీ కష్టాలను వినేందుకు, మీ కన్నీళ్లు తుడిచేందుకే ప్రభుత్వం మీ గడప వద్దకు వచ్చింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగే వరకు మేము విశ్రమించం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. శనివారం నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామంలో నిర్వహించిన 'ప్రజాదర్బార్'లో ఆయన పాల్గొని, జనంతో నేరుగా మమేకమయ్యారు.

**అర్హతే ప్రామాణికం.. రాజకీయాలకు అతీతం**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత పదేళ్లుగా సామాన్యులు పడుతున్న ఇబ్బందులను గమనించే తమ ప్రభుత్వం 'ప్రజల వద్దకే పాలన'ను తీసుకువచ్చిందని చెప్పారు. "రాజకీయాలకు అతీతంగా, కేవలం అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మే నెలాఖరులో రెండో దశ మంజూరు చేస్తాం. ప్రతి సోమవారం నిధులు విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తాం" అని స్పష్టం చేశారు.

**భూ సమస్యలకు చరమగీతం**

భూ సమస్యల ద్వారా రైతులు పడుతున్న ఇబ్బందులను రాబోయే రెండు నెలల్లో పరిష్కరించి, రైతులకు మేలు చేకూరుస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ దివాకర్‌తో కలిసి మంత్రి గంటల తరబడి ప్రజల మధ్యే ఉండి వందలాది మంది ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రతి వారం దీనిపై సమీక్ష నిర్వహిస్తామని మంత్రి పేర్కొన్నారు.




Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,